


# అస్పృశ్యనయనాలు

వసుంధర

ఈ ప్రపంచంలో నేను మనస్ఫూర్తిగా కేవలం రెండంటే రెండింటినే ప్రేమిస్తాను. సాధారణంగా ఎవరైనా తమకు అందుబాటులో లేనివే ప్రేమిస్తారంటారు. అదెంతవరకూ నిజమో నాకు తెలియదుకానీ— నా ప్రేమకు నోచుకున్న రెండింటిలో ఒకటి మాత్రం నాకా ష్టే అందుబాటులో లేదని చెప్పవచ్చు. అదే డబ్బు.

నా అదృష్టం కొద్దీ నేను పొరుగూరో ఉండి చదువుతున్నాను—కానీ లేకపోతే సిగ్గులో సగం చచ్చి ఉండేదాన్ని. నేను మామూలు చీర కట్టినా గొప్పవాళ్ళ అమ్మాయిలాగే కనబడతాను. అది నాశరీరపు ఒంపుసొంపుల అమరికలోనూ, నాముఖ సౌందర్యంలోనూ ఉంది. మాఊళ్ళో కాలేజీలేదు. చదువుకున్న అమ్మాయంటే కట్నం తగ్గుతుంది కాబట్టి—నన్ను చదివించాలని నాన్నగారి ఉద్దేశ్యం. పొరుగూర్లో కాలేజీఉంది బాగాడబ్బున్న అత్తయ్య ఉంది. ఆమె దగ్గర అంతులేని అభిమానం కూడా ఉంది ఇవన్నీ చేరినాకు కాలేజీ యోగంతో పాటు రాజయోగం కూడా పట్టినాయి.

అత్తయ్యకు ఆడపిల్లలు లేరు. ముగ్గురు మగపిల్లలున్నారు. అందరికంటె పెద్దవాడు నాకంటె మూడేళ్ళుచిన్న. అత్తయ్య ఇంట్లో ఒక రాజకుమారిలా కాలం గడిపాను. అత్తయ్యకు నేనంటే వింతో మోజుకావడం అందుకు కారణం.

అత్తయ్యకు ఆడపిల్లలు లేకపోవడం తాత్కాలికంగా ఒక వరమైంది నాకు. కన్నకూతురి కంటె అబ్బురంగా చూసేది అత్తయ్య నన్ను. అది ఒక విధంగా నాకుచాలా ఆనందం కలిగించింది. నేనులేని వాళ్ళ అమ్మాయినని ఎవరూ అనుకోలేదు. హాస్టల్లో చేరడానికి డబ్బులేక—అత్తయ్య ఇంట్లో నేనుంటున్నాన్న విషయం కనీసం అత్తయ్యకు కూడా తెలియదు.

నా మనస్తత్వానికిది బాగా సరిపడింది. నాకు దరిద్రమంటే అసహ్యం. డబ్బు అంటే పిచ్చి ప్రేమ. డబ్బును మంచినీళ్ళలా ఖర్చుపెట్టే స్థాయికి ఎదగాలన్నది నా ఆశయం. నాసౌందర్యానికి దాసోహమని ఏలక్షాధికారి కొడుకైనా నన్ను ప్రేమిస్తాడనీ ప్రేమించి పెళ్ళి చేసుకుంటాడనీ నాకు ఆశకూడా ఉంది. ఆ ఆశనమ్మకంగా మారే అవకాశం శేషగిరి పరిచయంతో కలిగింది.

శేషగిరి నా వెంట పడుతున్నట్లు నేనెప్పుడో పసిగట్టాను. అయితే ఆవిషయం అతనికి తెలియదు. కానీ అతను నావెంట పడడం నాకు ఇష్టమే! ఎందు కంటే అతను చాలా అందంగా ఉంటాడు. మసిలే పద్ధతిని బట్టి అతను చాలా సంపన్నుడని ఇట్టే ఊహించవచ్చు. అయితే అతనంటే నేనిష్టపడడానికి ముఖ్యకారణం అతని కళ్ళు. అన్నట్టు చెప్పడం మరిచిపోయాను నేనీ ప్రపంచంలో ప్రేమించేది రెండేరెండింటినన్నాను కదూ ఒకటి డబ్బు—రెండు-అందమైన కళ్ళు.

భగవంతుని సృష్టిలో కంటికి మించి అపూర్వమైన దేదీ మరిలేదని నా దృఢ విశ్వాసం. అయినా అందరికళ్ళు అందంగా ఉండవు. కానీ మనిషి అందం చాలావరకు కళ్ళలోనే ఉన్నదని నిర్వివాదాంశం. నేనేమనిషి ఎయినా కళ్ళుమాత్రం చూసి అంచనావేస్తాను. మనిషి భావాలు కళ్ళలో— ప్రతిఫలిస్తాయిగదా చెడ్డవాడికళ్ళు చెడ్డ చూపులుచూస్తాయి.చెడుచూపులు కంటి అందాన్ని పాడుచేస్తాయి. అందమైనకళ్ళంటే దుర్మార్గుడు కాలేడన్నది నా సిద్ధాంతం. అందమైన కళ్ళున్నవారు ఏతప్పుచేసినా నేను సహిస్తాను.అందుకే నామూడో తమ్ముడూ, రెండో చెల్లెలూ ఎన్నడూ తప్పుచేసినట్లు అనిపించదు నాకు. నాన్నగారు కానీ అత్తయ్యగానీ తప్పు చేస్తారనిపించదు నాకు. అందమైన కళ్ళున్న వాళ్ళను ప్రేమిస్తాను నేను. మరి శేషగిరివి— అందమైన కళ్ళు! ఎంత అందమో మాటల్లో వివరించలేనంత అందమైనకళ్ళు!

సంపన్నుడైన శేషగిరికి అందమైన కళ్ళున్నాయి. ఇంతకంటె జీవితంలో కోరుకోవలసినదేముంది నాకు. ఆ శేషగిరి నా పరిచయాన్నభిలషించగానే- నేను వెంటనే అందకుండా

ఒక క్రమపద్ధతిలో అతనితో స్నేహం పెంచసాగేను. మా స్నేహం నెమ్మది నెమ్మదిగా ప్రేమగా మారసాగింది. నేను క్లాసులు ఎగవేసి శేషగిరితో సినిమాలకు వెళ్ళాను. స్నేహితురాలింటికి అని అత్తయ్యకు అబద్ధం చెప్పి అతన్ని పార్కులో కలుసుకున్నాను. అతన్ని హద్దుల్లో ఉంచడానికి నేను ప్రత్యేకంగా ఏమీ అవస్థ పడనవసరం లేకపోయింది. శేషగిరి చాలా బుద్ధిమంతుడిలా ప్రవర్తించేవాడు. మరి అతనివి అందమైన కళ్ళు అతని ప్రవర్తన అందంగా ఉండక మరెలా ఉంటుంది?

శేషగిరి నాకోసం డబ్బు మంచినీళ్ళలా ఖర్చుపెట్టేవాడు. అతనలా ఖర్చుపెడుతూంటే నాకు చాలా ఆనందంగా ఉండేది. నాకోసం ఖర్చు పెడుతున్నాడన్న ఆనందం కంటే — అతనికి డబ్బంటే లెక్కలేదన్న విషయమే నాకెక్కువ ఆనందం కలిగించేది. అందువల్లనే నా అలవాట్లన్నీ అతనిదగ్గర చాలా ఖరీదైనవిగా ఉండేవి. ఐస్‌క్రీమ్ తప్ప తినేదాన్నికాదు. కూల్ డ్రింక్ తప్ప తాగేదాన్ని కాదు. టాక్సీలో తప్ప ఎక్కేదాన్నికాదు.

పిల్లి కళ్ళుమూసుకుని పాలుతాగినంత మాత్రాన ఇతరులకు కనబడకుండా పోదు. మా పరిచయాన్ని రహస్యంగా ఉంచడానికి మేము చేసిన ప్రయత్నాల విలువ అంత మాత్రమే అయింది. ఒకరోజు అత్తయ్య నన్ను ప్రేమగా పక్కగదిలోకి పిలిచి—అక్కడ ముఖం వాచేలా నానాచీవాట్లూ పెట్టింది. అంతవరకూ అత్తయ్య ప్రేమను మాత్రమే చవిచూసిన నేను హడలిపోయాను. అత్తయ్య నామీద కోపపడగలదనీ, అందులోనూ అంత దారుణంగా కోపపడగలదనీ ఆరోజే నాకు అర్థమైంది.

"నువ్వెంతో మంచిదానవనుకున్నాను, అమాయకురాలవనుకున్నాను. అందుకే మీనాన్న చెప్పిన వెంటనే నిన్ను మా ఇంట్లో ఉంచుకునేందుకు ఒప్పేసుకున్నాను. కానీ నువ్విలా ప్రవర్తిస్తావనీ, నా పరువు తీస్తావనీ, మీ నాన్నకు సమాధానమిచ్చుకోవలసిన స్థితికి నన్ను లాగుతావనీ నేననుకోలేదు అన్నది ఆమె చీవాట్లలోని సారాంశం. నాకు జవాబు ఏం చెప్పాలో తెలియలేదు. ఏడుస్తూ కూర్చున్నాను. తిట్టి తిట్టి అలసిపోయి అత్తయ్య నెమ్మదిగా దగ్గరకువచ్చి తల నిమిరింది. నాకింకా ఎక్కువ ఏడుపువచ్చి అత్తయ్య ఒడిలో వాలి బావురుమన్నాను. ఈసారి అత్తయ్య నన్ను ఓదార్చింది.

"పిచ్చిపిల్లా నీ బాగుకోరేదాన్ని కాబట్టి ఇలా కఠినంగా మాట్లాడవలసి వచ్చింది. యుక్తాయుక్త జ్ఞానం తెలియని వయసు కాబట్టి నువ్వు తప్పుదారిన నడుస్తున్నావు. నువ్వు అమాయకురాలివని నాకు తెలుసు. అందుకే నా బాధ..." అన్నది ఆమె ఓదార్పులోని సారాంశం.

తర్వాత నెమ్మదిగా అత్తయ్య నా దగ్గర్నుంచి వివరాలు రాబట్టింది. అతనెవరో తెలుసుకుంది. నేను హద్దులు అతిక్రమించలేదని రూఢి చేసుకుంది. ఇకమీదట అతనితో తిరగవద్దని హెచ్చరించింది. అన్నింటికీ మౌనంగా తల ఊపాను.

ఆ తర్వాత నిజంగానే నేను కొన్నాళ్ళపాటు శేషగిరిని తప్పించుకు తిరిగాను. నేనెందుకలా తప్పించుకు తిరుగుతున్నానో తెలియని శేషగిరి చాలా కలవరపడి ఉండాలి. ఈ విధంగా అతనికి నాపట్ల ఆకర్షణ పెరిగి కూడా ఉంటుంది. ఈ రకమైన ఆలోచనలతో నన్ను నేను తృప్తి పరచుకుని— శేషగిరికి అందకుండా పోసాగాను అయితే ఒక రోజు నేను కాలేజీ నుంచి యింటికి వచ్చేసరికి— శేషగిరి మా యింట్లో ఉన్నాడు. "ఎంత ధైర్యం!" అని ఆశ్చర్యపోయాను. అత్తయ్య ఏమంటుందో నన్న బెదురు కూడా కలిగింది. అయితే అత్తయ్యే అతన్నక్కడికి రప్పించిందన్న విషయం నన్ను నిశ్చేష్టురాలిని చేసింది. అత్తయ్య ఎంత మంచిది?

అత్తయ్య శేషగిరితో చాలాసేపు మాట్లాడింది. అంతసేపూ నేను వంటింట్లో వున్నాను. ఆ ప్రాంతాలకు వెళ్ళడానికి నాకు సిగ్గేసింది. చాలాసేపు తర్వాత అత్తయ్య వంటింట్లోకి వచ్చి "అతను వెళ్ళిపోయాడు" అంది. "అయ్యో!" అనిపించింది కానీ పైకి అనలేక పోయాను. అత్తయ్య ముఖంలో చిరునవ్వులు చిందాయి. "ఈ రోజుల్లో కులం, మతం అంటూ పట్టుకు వేళ్ళాడ్డం చాలా తెలివి తక్కువ పని. మీ నాన్న ఏమంటాడో నాకు తెలియదు కానీ కుర్రాడు యోగ్యుడని నాకు అనిపించింది. ఏమో అనుకున్నాను కానీ నువ్వు తెలివైన దానవే! మంచివాణ్ణే వెతుక్కున్నావు."

నాకు సిగ్గు వేసింది. ఏం మాట్లాడలేదు.

"మీ నాన్నను ఒప్పించడానికి నా శాయశక్తులా ప్రయత్నిస్తాను. ఒప్పుకోక పోవడానికి మాత్రం ఇందులో ఏముందిలే— అతనికి నా అన్నవాళ్ళెవరూ లేరు. నెలకు అయిదొందలకు పైగా వచ్చే ఉద్యోగం ఉంది. అన్నింటికీ మించి మనిషి చాలా మంచివాడు. కట్నం అక్కరలేదట. పెళ్ళి చేసుకోవడం కోసమే నీతో పరిచయం చేసుకున్నాడు" అంది అత్తయ్య మళ్ళీ.

పిడుగు పడ్డట్టు ఉలిక్కి పడ్డాను. అతనికి నెలకు అయిదొందల రూపాయల జీతమా? అతనుద్యోగం చేస్తున్నాడా? ఉద్యోగం చేయవలసిన అవసర మేమిటి? సరదాకు, ఊసుపోకకు చేస్తున్నాడనుకుందామన్నా— అంత చిన్న ఉద్యోగం ఎలా చేస్తున్నాడు? ఇందులో ఏదో మోసముంది.

అతను నాతో రెండు కార్లున్నాయనీ అమ్మానాన్నా పెద్దవాళ్ళు తనకవి అందుబాటులో ఉంచారనీ, తన తలిదండ్రులు పెద్ద వ్యాపారస్తులనీ చెప్పాడు. అతనికి నా అన్నవాళ్ళెవరూ లేరని అత్తయ్య అంటోంది.

"అతనిది మన కులం కాదా అత్తయ్యా" అన్నాను నెమ్మదిగా.

"కాదు. అయితే యేం..." అని అత్తయ్య ఏమో అనబోయింది.

"నన్ను బాగా ఆలోచించుకోనీ అత్తయ్యా మాది పెద్ద కుటుంబం. నాకింకా పెళ్ళి కావలసిన చెల్లెళ్ళున్నారు—" అని అక్కణ్ణుంచి వెళ్ళిపోయాను, మర్నాడతన్ని కలుసుకుని నిలదీయాలన్నది నా ప్రస్తుతాశయం.

అనుకున్నట్లుగానే మధ్యాహ్నం కాలేజీ గేటు దగ్గర అతను కనిపించేడు. మాట్లాడకుండానే అతన్ననుసరించాను. అతను టాక్సీ వైపు వెళబోతూంటే "వద్దులే - నడిచే వెడదాం" అన్నాను. ఇద్దరం ఒక పార్కులోకి చేరాం.

**అమెరికాలో పనికిరాని సామాన్లు**

అమెరికాలో ప్రతి సంవత్సరం ఎన్ని కారులు పనికిరానివిగా వదలివేస్తారో తెలుసా? 70 లక్షల కారులు - అంతే కాదు 550 లక్షల క్యానులు, 2600 కోట్ల సీసాలు – 65 కోట్ల సీసా మూతలు—కూడా వదలివేస్తారుట!

# అస్పృశ్యనయనాలు

"ఎందుకు నాకు అబద్ధం చెప్పావ్?" అన్నది నా మొదటి ప్రశ్న.

"మీ క్లాస్‌మేట్ అరుణ నాకు బాగా తెలుసు. వాళ్ళ ఇంట్లోనే నే నద్దెకుంటున్నది. నిన్ను గురించి ఆమె ద్వారానే తెలుసుకున్నాను. తన క్లాసులో అప్సరస లాంటి అమ్మాయుందనీ దరిద్రమన్నా, పేదవాళ్ళన్నా ఆమెకు అంతులేని అసహ్యమనీ ఆమె నాకు చెప్పింది. కుతూహలం కొద్దీ నిన్ను చూసి ప్రేమలో పడ్డాను. నువ్వులేకపోతే బతకలేననిపించింది. నీతో పరిచయం చేసుకోవాలంటే ధనవంతుడిలా నటించడమొక్కటే మార్గ మనిపించింది. అందుకే అబద్ధం చెప్పాను"

నాశరీరం కుతకుతలాడిపోయింది "పేదవాళ్ళంటే నాకు అసహ్యమని తెలుసు. ఎప్పటికైనా నీసంగతి నాకు తెలుస్తుందని తెలుసు కదా ఎప్పుడు......"

అతను తాపీగా నవ్వాడు "నేను పేదవాడిని కానే. నెలకు అయిదొందలు దొరికే ఉద్యోగముంది. డబ్బుదుబారా చేసే చెడు అలవాట్లు లేవు. వెనకాముందూ ఎవరూ లేరు. పెళ్ళిళ్ళ బజార్లో నాకు చాలా విలువ ఉంది. పదివేలకు మించి కట్నంకూడా పలుకుతుంది. నేను లక్షాధికారిని కాకపోవచ్చు. కానీ పేదవాడిని మాత్రం కాదు"

"కావచ్చు కానీ జీవితం గురించి నేనుకన్న కలలువేరు కార్లలో ప్రయాణం, క్లబ్బుల్లో విహారం అనుదినంచూపించను. నగల షాపులో అడుగు పెట్టగానే నమ్రతగా ఒరిగిపోయే మనుషులు- ఇంట్లో పనివాళ్ళు.... ఎన్నని చెప్పను నాకలలన్నీ నీకళ్ళలో ప్రతిఫలించాయి. మోసపోయాను"

"అలా అనకు సుమా! మనం ఒకరినొకరు ప్రేమించు కున్నాం. మనకున్న సౌకర్యాలతో ఎంతో హాయిగా జీవితం గడపవచ్చు. నీకోరికలకు కారణం నీబుద్ధి ఇంకా వికసించకపోవడం నీకోరికల్లో సుఖంలేదు. నేనాడిన అబద్ధాలకు నన్నుక్షమించు. నీప్రేమను పొందడం కోసమే అబద్ధమాడాను నేను. ఒకసారి నీప్రేమలభించాక నేను చేసిన ఎంత పెద్ద తప్పునైనా క్షమించగలవని నా నమ్మకం. అందమైన నీకళ్ళలో ఒక్కసారి నాపట్ల ప్రేమ, జాలి ప్రతిఫలించనీ' అన్నాడతను జాలిగా ముఖం పెట్టి.

ఆక్షణంలో నాకు అతని పట్ల అంతులేని అసహ్యం కలిగింది. మొట్టమొదటి సారిగా నేను ఒక అందమైన కళ్ళున్న వ్యక్తి చేసిన తప్పును క్షమించలేక పోయాను. అంతేకాదు ఆకళ్ళున్న ముఖాన్ని ద్వేషించడం కూడా ఆరంభించాను. "కళ్ళు చూసి మోసపోరాదు" అనుకున్నాను అతని వంక సూటిగా చూశాను. నాముఖం చూస్తూనే అతనిముఖం వివర్ణమై పోయింది.

"సుమా! అలాచూడకు. నీకళ్ళు ప్రేమను తప్ప మరేమీ ప్రసరించ లేవనుకున్నాను. వాటిల్లో ఇప్పుడు ద్వేషం, అసహ్యం కనబడుతున్నాయి. అదినేను భరించలేను. నీకంటికి అదినప్పలేదు. నీ అందానికి అదిమచ్చగా ఉండిపోయింది ప్లీజ్‌సుమా! అలా చూడకు" అన్నాడతను.

అందమైన నాకళ్ళలో ద్వేషమా? అసహ్యమా? ఎందుకో ఉలిక్కి పడ్డమాట మాత్రం నిజం. కానీ అతనివంక అలాగే చూడసాగాను. అతనక్కణ్ణించి లేచి వెళ్ళి పోయాడు.

నామనసు పాడై పోయింది. అంతే చిందర వందరగా ఉంది. అతను నాకళ్ళలో ద్వేషాన్నీ అసహ్యాన్నీచూశాడు. అందమైన నాకళ్ళకు అదినప్పలేదన్నాడు. ఆదృశ్యం సహించలేక వెళ్ళిపోయాడు.


అయితే నేనెంతగానో ప్రేమించే కళ్ళలో ఏవిశేషమూలేదా? పరిస్థితుల ప్రభావానికిలోనై ఎంత అందమైన కళ్ళయినా అన్నికళ్ళలాగే చూస్తాయా?

నేను మంచి దనుకున్న కళ్ళు నన్నుమోసం చేశాయి. అందమైన వనుకున్న నాకళ్ళలో అసహ్యం, ద్వేషం కూడా ప్రతి ఫలించబడింది కళ్ళు మనిషి శరీరంలోని ఒక భాగం మాత్రమే. మెదడు ఇచ్చే ఆజ్ఞల ననుసరించి అవి ప్రవర్తిస్తాయి.

తర్వాత శేషగిరి నాకు రెండుత్తరాలు రాశాడు. ఎన్నోసార్లు నన్ను కలుసుకుందుకు ప్రయత్నించాడు. నేను లేకపోతే తను బ్రతకలేడుట. కఠినత్వం వహించక తన్ను వివాహం చేసుకోవాలిట. నేను తనకు అండగా వుంటే ఎన్ని కష్టాలైనా పడి నేను కోరిన సంపదను కూడా సాధించగలడుట,

నేనూ అతనికి ఉత్తరం రాశాను. నన్ను మరచి పొమ్మనీ, ఏ పరిస్థితుల్లోను అతన్ని వివాహం చేసుకోవడం జరగదనీ కొన్ని సంవత్సరాల పునాదితో ఏర్పడ్డ నా కలలు చాలా బలమైనవనీ అవి తప్పక ఫలిస్తాయన్న నమ్మకం నాకున్నదనీ, ఫలించకపోతే కన్నెగానైనా ఉండిపోతా తప్ప వివాహం చేసుకోననీ రాశాను.

నా సౌందర్యం నాకు తెలుసు. నా ఆర్థిక అర్హతలను బట్టి చూస్తే, శేషగిరి చాలా మంచి వరుడు. అలాంటి సంబంధం దొరకడం నాకు చాలా కష్టం. కానీ ఏం చేయను— ఎందుచేతనో డబ్బును నేను ప్రేమిస్తాను. అలాగే అందమైన కళ్లలో ఏ విశేషమూ లేదని తెలిసి కూడా వాటిని ప్రేమించ కుండా ఉండలేక పోతున్నాను. బహుశా అది నా బలహీనత. ఆ రెండింటినీ ప్రేమించకుండ ఉండలేను నేను.



బియ్యే ప్యాసు కాగానే ఉద్యోగం దొరికింది నాకు. అయితే ఇప్పుడు నేను అత్తయ్యవాళ్లో ఉండడం లేదు. ఒక పెద్ద సిటీలో ఉంటున్నాను. కార్లలో తిరగాలని కలలు కంటూ నెలకు అయిదు వందలు సంపాదించే ఉద్యోగం గల మగవాడిని వదులుకున్నాను నేను. కానీ ఇప్పుడు నా కొచ్చే జీతం మూడు వందల యాభై మాత్రం. అయినా నేను కలలు కనడం మానలేదు. వీలైనంత దర్జాగానే జీవితం గడుపుతూ నెలకు ఎనభై రూపాయలు ఇంటికి కూడా పంపుతున్నాను. అయితే తరచుగా ఇంటికి వెళ్లను నేను. దారి ఖర్చులకు భయపడి కాదు. మా ఇంట్లోని దరిద్రానికి భయపడి.

అలాగని మా ఇంట్లో దరిద్రం విలయ తాండవం చేస్తుందనుకునేరు. నా ఆలోచనల అంతస్తు వేరు. ఆ అంతస్తులోంచి చూస్తే శేషగిరి దరిద్రుడు. మాదీ దరిద్ర కుటుంబం.

ఏ విధమైన విశేషాలూ లేకుండా రెండు సంవత్సరాలు గడిచిపోయాయి. అప్పుడు హఠాత్తుగా నా జీవితం అనుకోకుండా గొప్ప మలుపు తిరిగింది. అదీ నేను కోరిన విధంగా!

అతనెవరో చాలా గొప్పవాడిలా గున్నాడు. మా ఆఫీసుకు ఏదో పనిమీద వచ్చినట్లున్నాడు. అటూ ఇటూ తిరుగుతూ చటుక్కున నన్ను చూసి ఆగిపోయాడు. ఏమనుకున్నాడో ఏమో నా దగ్గరకు వచ్చి "మేడమ్ ఏమీ అనుకోనంటే ఒక చిన్న ప్రశ్న. మీ పేరేమిటో చెప్పగలరా?" అన్నాడు.

అతనిలో ఏ ప్రత్యేకతా నాకు కనిపించలేదు. కానీ ఏ మనిషినైనా చూడగానే అప్రయత్నంగా అతని కళ్లవంక చూడడం నా అలవాటు అతని కళ్లు నాకు నచ్చలేదు. అతని ముఖం అందంగా లేకపోవడానికి అతని కళ్లే కారణ మనిపించింది. అయినా పేరు చెప్పడాని కేముంది? "సుమలత!" అన్నాను నెమ్మదిగా.

"పేరు అందమైనదే కానీ ముఖం ఇంకా అందంగా ఉంది" అన్నాడతను.

నేను నవ్వి "చాలా థాంక్స్. మీ కేమైనా ఇక్కడ పని ఉందా" అన్నాను.

"ఉంది కానీ మిమ్మల్ని చూడగానే మరచిపోయాను. మీకు అభ్యంతరం లేదంటే..." అని అతను ఆగిపోయాడు. నేను కుతూహలంగా అతని వంక చూసి "లేదంటే...ఊఁ" అన్నాను.




"ఆఫీసుకు రోజూ ఇంత పెందరాళే వస్తున్నావు — నీ సంసారం జీవితం అంత సుఖంగా లేదా ?!"

అతను నిట్టూర్చాడు, "నా వయసు ఇరవైయారేళ్లు. లెక్కలేనంత ఆస్తికి వారసుణ్ణి. మంచి అందమైన భార్యకావాలని ఎంతో కాలంగా కలలు కంటున్నాను. ఇంత వరకూ నా కలలు ఫలించలేదు..." అతను మళ్లీ ఆగిపోయాడు. ఈ సారి నాకు కుతూహలం కలగలేదు. కొద్దిగా భయం కూడా వేసింది. డబ్బున్నా డెవడూ వచ్చి కట్టుకుని తను లెక్కలేనంత ఆస్తికి వారసుడనని చెప్పకోడు. వీడెవడో నా బలహీనతను తెలుసుకుని వచ్చా డనిపించింది.

"మీ అభిప్రాయం నాకు అర్థమైంది. కానీ నేను మీరనుకున్నలాంటి మనిషిని కాను. నేను చూడగానే మనుషుల్ని అంచనా వేయగలను మీ ముఖం చూశాను. మీ కళ్లు నాకు నచ్చలేదు. కళ్లు బాగాలేని ఏ మనిషైనా —నాకు నచ్చడు." అతను ఎక్కువగా చొరవ తీసుకున్నాడనిపించడంవల్ల నేను కొంచెం మర్యాద నతిక్రమించి మాట్లాడానని చెప్పవచ్చు. అందుకే అతని ముఖం వివర్ణమైంది.

"చూడండి ఇంతవరకూ జీవితంలో ఓటమి నన్నది ఎరుగను నేను. ఏ నిర్ణయమైనా క్షణాలమీదనే తీసుకోవడం అలవాటు నాకు. మిమ్మల్ని చూసీ చూడగానే వివాహం చేసుకోవాలనిపించింధి. అందుకోసం ఏమైనా చేయగలను. ఒప్పుకోకపోతే బలవంతంగా ఎత్తుకుపోయైనా వివాహం చేసుకోగలను. ఒప్పుకుంటే ఈ క్షణంలో మీ పేర బ్యాంకిలో లక్షరూపాయలకు అకౌంట్ ఓపెన్ చేయగలను" అన్నాడు.

కోతలకైనా అంతుండాలనుకున్నాను. వీడి సంగతేమో ఇప్పుడే తేల్చాలనిపించింది. అందుకు "అయితే నా పేర లక్షరూపాయలకు అకౌంట్ ఓపెన్ చేయండి. నేను మిమ్మల్ని వివాహం చేసుకుంటాను" అన్నాను.

"మీ బాస్ నడిగి పర్మిషన్ తీసుకోండి — ఇప్పుడే బ్యాంకుకి వెడదాం" అన్నాడు వాడు. వాడితో కలిసి బయటకు వెళ్ళడం ప్రమాదకరమనిపించింది. "మీరు బ్యాంకు దగ్గర ఉండండి ఒక గంటలో నేను వస్తాను. ప్రయివేటు బ్యాంకు కాదు, స్టేట్‌బ్యాంకు దగ్గరకు" అన్నాను. వాడు వెళ్ళిపోయాడు.

ఆశ, అనుమానం, ఆశ్చర్యం. భయం ఒక్కసారిగా కలిగాయి. జీవితంలో ఇది చెప్పుకోతగ్గ వింత సంఘటన అయితే మరో గంటన్నరలో నిజంగానే నేను లక్షాధికారిణి నయ్యాను.

వాడు-కాదు, సారీ—అతను-కాదు, సారీ —వారు ... అన్నమాట నిజంగానే నిలబెట్టుకున్నారు. వారిపేరు రామనాథం. మరో పది రోజుల్లో వారు నా శ్రీవారయ్యారు.

నేను రామనాథం శ్రీమతిని కావడం నా జీవితంలో ఒక బంగారు కల. నమ్మలేని నిజం.

నా కిప్పుడు స్వంత కారుంది. డ్రైవింగు కూడా వచ్చును. చాలా తరచుగా షాపింగుకు వెడుతూ ఉంటాను నేను. ఏ షాపుకు వెళ్ళినా అంతులేని గౌరవం లభిస్తూంటుంది నాకు. దరిద్రంపట్ల నా అసహ్యం మరింత పెరిగింది. అది చాలా తరచుగా వ్యక్తపరుస్తూంటాను నేను. కానీ వారి కళ్ల పట్ల నాకుగల అసహ్యతను మాత్రం పైకి వ్యక్తపరచలేక పోతున్నాను.

నేను ప్రపంచంలో ఎక్కువగా ప్రేమించేవి రెండేరెండు. ఒకటి డబ్బు. అది నాకు లభించింది. రెండు—అందమైన కళ్లు. అవి వారికి లేవు. నేను డబ్బును ప్రేమించడంతో పాటు దరిద్రాన్ని అసహ్యించు కుంటాను. అందమైన కళ్లను ప్రేమించినట్లే — వికారమైన కళ్లను అసహ్యించు కుంటాను. కానీ వారి కళ్లనెలా అసహ్యించుకునేది ?

ఆ కళ్లు నన్ను చూడడం వల్లనే నాకీ వైభవం పట్టింది. అయినాసరే ఆ కళ్లంటే నాకు అసహ్యం. ఎంత సహించు కుందామన్నా

కుదరడంలేదు. ఇంత అదృష్టాన్ని నాకు కలిగించిన భగవంతుడు ఒక్క విషయంలోనూ ఎందుకు చిన్నచూపు చూశాడో అర్థం కావడంలేదు.

అన్నింటికంటె బాధాకరమైన విషయం మరొకటుంది. ఆయన ప్రేమగా నన్ను దగ్గరకు తీసుకుని "నీ అందమంతా కళ్ళలో ఉందిసుమా!" అని కళ్ళను ముద్దు పెట్టుకుంటారు. నేను తనకు అలా చేస్తానని ఆశిస్తారు. కాని నేనెన్నడూ ఆయన కళ్లను ముద్దు పెట్టుకోలేదు. ఆయన కళ్ళలో తీవ్రమైన ఆశాభంగం చూస్తాను. అయినా నేనుచలించను. అసహ్యకరమైన ఆ కళ్ళను ముద్దు పెట్టుకోవడం నావల్ల కాదు. అంతేకాదు ఆయన ముందునగ్నంగా ఉన్నప్పుడు ఆకళ్ళు నన్నుకాంక్షతో చూస్తున్నాయన్నభావం నాకు కలిగించే జుగుప్సాభావం అంతా ఇంతాకాదు. నాలో ఉన్న అహంకారం పాలు ఎక్కువ కావడంవల్లనో ఆయన చాలా మంచివారు కావడంవల్లనో చెప్పలేను కాని చాలావరకు నాకు కలిగే భావాలను దాచడానికి కూడా ప్రయత్నించనునేను. ఆవిధంగా ఆయన్నుచాలాసార్లు నిరుత్సాహ పరిచాననే చెప్పాలి.

వారు దగ్గరలేనప్పుడు ఎన్నోసార్లు నాకు వారిమీద జాలికలుగుతూంటుంది. ఒకఅనామకురాలికి రాజయోగం పట్టించినవారికి తగిన సుఖం నేనివ్వలేకపోతున్నానని అప్పుడప్పుడు నాకు అనిపిస్తూండేది. కానీ ఆకళ్ళను చూడగానే అన్నీ మరచిపోయేదాన్ని. గొంగళి పురుగు మీద పాకినట్లుండేది ఆకళ్ళు నన్ను కాంక్షతో చూస్తూంటే.

నేను కృతఘ్నురాలినేకావచ్చు. కానీ మామూలు బలహీనతకు లొంగిపోయిన సామాన్యురాలిని.

ఆయన ఎప్పుడూ నన్ను పల్లెత్తుమాట అనలేదు. నన్నుప్రేమగా చూడ్డం మానలేదు. తను దగ్గరలేనప్పుడు నా ప్రవర్తన మార్చుకోవాలని చాలా గట్టినిర్ణయాలు తీసుకునేదాన్ని. ఆయన సమక్షంలో ఆకళ్ళను చూస్తూ అవన్నీ మరిచిపోయేదానిని. అసహ్యమొక్కటే స్ఫురించేది. ఇలా ఎందుకు జరుగుతోందో మాత్రం నాకు తెలియదు. ఏదో అతీతశక్తికిలోనై అలా ప్రవర్తిస్తున్నానేమో ననిపించేది.

ఏది ఏమైనా జీవితం సాఫీగానే నడిచిపోతోంది.ఎదుటి వ్యక్తికి బాధ కలిగిస్తున్నప్పటికీ నేను ఆనందంగానే జీవితం గడుపుతున్నాను.

ఇప్పుడు నాకొక కొత్త సమస్యబయల్దేరింది నాకడుపులో ఒక కొత్త ప్రాణికదులుతోంది. ఆప్రాణి ఆడకావచ్చు, మగకావచ్చు, కానీ ఆయన పోలిక తెచ్చుకుంటుందేమో నన్నది నాభయం. ఆయన పోలిక వచ్చినా నాకంత అభ్యంతరంలేదు. ఆకళ్ళు వస్తాయేమోనని అసలు భయం. చాలాసార్లు దేవుణ్ణి ప్రార్థించాను కూడా–పుట్టబోయే పాపకు నాపోలిక రావాలని. కానీ ఆయనకూడా దేవుణ్ణి ప్రార్థిస్తున్నారు తనపోలిక బాబుకురావాలని. ఒక రోజు నేను పక్కనుండగానే పైకి అనేశాడు దేవుడి దగ్గర "నాకు బాబుపుట్టాలి. వాడికి నాపోలిక రావాలి"అని.

నాకు ఒళ్ళు మండి పోయింది "మంచి కోరికే రాకరాకవాడికి మీకళ్ళేరావాలా?" అన్నానుచిరాగ్గా.ఆయన ముఖం చాలాకోపంగా అయిపోయింది. "నీకు అందానికి అర్థం తెలియదు. తెలిసుంటే నాకళ్ళలో అందంకనిపించేది" అనేసి అక్కణ్ణించి వెళ్ళిపోయారు.

నేను తెల్లబోయాను. ఆయన నన్నుఅంత మాట అంటారని నేను అనుకోలేదు. ఎందుకంటే అదే ప్రథమానుభవం మరి.

నెలలునిండాయి. వారికోరిక ప్రకారం నాకు బాబుకలిగాడు. వాడిపోలికలు మొదట్లో ఏమి తెలియలేదు. కానీ ఆరేడు నెలలవయసు వచ్చే సరికి వాడిలో క్రమంగా ఆయన పోలికలు కనిపించసాగాయి. దేవుడు ఆయన కోరికను మన్నించాడు.వాడిజుట్టు ఆయనజుట్టుకు మల్లేనే ఉంగరాలు తిరిగి ఉంటుంది. చూడగానే ముక్కూ, చెవులూ ఆయనవేనని చెప్పవచ్చు. అయితే దేవుడు నాకోరికను కూడా మన్నించాడు.వాడికళ్ళు మాత్రం ఆయనవి కాదు. ఎంతో అందమైన కళ్ళు. నాఅదృష్టాన్ని నేనే అభినందించుకున్నాను. నాబాబును నేను అసహ్యించుకోవలసిన అగత్యం తప్పింది.

బాబు అంటే ఆయనకు ఎంతో అభిమానం. బాబు పుట్టాక మా ఇద్దరి అనుబంధం మరింత పెరిగింది. ఆయన నన్నింకా ఎక్కువగా అభిమానిస్తున్నారు. ముఖ్యంగా వాడి కళ్ళంటే ఆయనకు ప్రాణం. రోజుకో వందసార్లయినా వాటిని ముద్దులాడతారు. ఆ దృశ్యం నాకు చాలా ఆనందాన్ని కలిగిస్తుంది.

ఆయన మంచి తనాన్నర్థం చేసుకున్నాను నేను. మానసికంగా ఆయనకు బాగా దగ్గరవుతున్నాను. కానీ ఆయన కళ్ళ పట్ల నా కున్న అసహ్యభావం మాత్రం లేశమయినా తగ్గడం లేదు.

బాబు పెద్దవాడవుతున్నాడు. చాలా అల్లరి చేస్తున్నాడు. వాడేంచేసినా నాకు ఎంతో ముద్దుగా ఉంటోంది. జీవితంలో తల్లి కావడానికి మించిన మధురానుభూతి లేదన్న నగ్నసత్యం అవగాహన అవుతోంది.

ఒకరోజు ... ...

బాబు ఒక పుస్తకం పట్టుకుని నా దగ్గరకు వచ్చాడు. "అమ్మా, చూడు ..." అంటూ అది ఆయన డైరీ వెధవ ఎక్కడైనా ఏమైనా చింపేశాడేమోనని కాస్త జాగ్రత్తగా పరిశీలించి చూశాను. చింపిన జాడ కనపడలేదు. కాని డైరీకున్న పైడు కవరులో ఏదో ఫొటో ఉన్నట్లు అనిపించి లాగి చూశాను. ఆ ఫొటో ...

ఉలిక్కిపడ్డాను. ఆ ఫొటోలో వ్యక్తి నాకు బాగా తెలుసు. గుర్తుపట్టడానికి క్షణం కూడా పట్టలేదు. నేను తొలిసారిగా అసహ్యించుకున్న అందమైన కళ్ళున్న ఆ వ్యక్తి శేషగిరి.

శేషగిరి ఈయనకు తెలుసా ? ఫొటో

## స్కోరెంత ?-8

### గెలుపూ - ఓటమీ

రామనాధన్ క్రిష్ణన్ పేరు టెన్నిస్ ఆడేవాళ్ళకి అది చూసి- దాని గురించి చదివి ఆనందించేవారికి కూడా పాతిక సంవత్సరాలుగా పరిచయమైన పేరు.. యీమధ్యనే హైదరాబాద్‌లో జరిగిన నేషనల్ హార్డ్ కోర్ట్ టెన్నిస్ ఛాంపియన్ షిప్ పోటీల్లో రామనాధన్ క్రిష్ణన్ 17 సం.ల బాలుడి చేతిలో ఓడిపోయాడు!

పాతిక సం.ల క్రితం రామనాధన్ క్రిష్ణన్ కలకత్తాలో తన 17వ ఏట నేషనల్ హార్డ్ కోర్ట్ టెన్నిస్ ఛాంపియన్ అయినాడు. దేశమంతా అటు తిరిగి చూసింది... "టెన్నిస్ స్టార్ ఉదయించిందన్నారు— అప్పుడు ఆ

టెన్నిస్ స్టార్ రామనాధన్ క్రిష్ణన్ యెంత సంతోషించాడో యిప్పుడు వోడిపోయి కూడా అంతే సంతోషించి వుంటాడు- తనను వోడించిన రమేష్ [15 సం.ల అరుమాసాల వయసు] ని కౌగలించుకుని బహు అరుదుగా మనిషికి జీవితంలో లభించే అతి మధురమైన అపురూపమైన అనుభూతిని పొంది వుంటాడు...కారణం ?

ఛాంపియన్ అయిన బాలుడు "రమేష్" మరెవ్వరోకాదు రామనాధన్ కృష్ణన్ కొడుకు రమేష్ కృష్ణన్... 'పుత్రాదిచ్ఛేత్ పరాజయమ్' అన్నారు. భారత టెన్నిస్ ప్రపంచానికి మకుటం లేని మహారాజు రామనాధన్ కృష్ణన్ మీద స్కోర్ చేసిన యువ టెన్నిస్ రాజుని చూసి టెన్నిస్ ప్రియులు 'టెన్నిస్ తార' మరొకటి ఉదయించిందని వర్ణించారు. [★★★]

దగ్గ రుంచుకునేటంత స్నేహముందా అతనితో ? అయితే ఎన్నడూ ఆయన నా దగ్గర శేషగిరి ప్రసక్తి తీసుకురాలేదంటే అందుకు కారణం ఏమిటి ?

నాకు డైరీ రాయడమన్నా, అది రాసే వాళ్ళన్నా చిరాకు. ఆయన డైరీ రాస్తారని తెలుసుండీ ఎన్నడూ దానివంక చూడాలని కూడా అనుకోలేదు. కానీ ఈరోజు ఆయన డైరీ చదివాను. అయితే అందులో చెప్పుకోదగ్గ విశేషాలేమీలేవు. చాలా సామాన్యమైన వివరాలున్నాయి.

పరుగెత్తుకు ఆయన దగ్గరకు వెళ్ళాను. ఆయన ఏదో రాసుకుంటున్న వారల్లా ఉలిక్కిపడి "ఏమిటోయ్ విశేషం"అన్నారు. ఫొటో ఆయనకు చూపించాను. "బాబు మీ డైరీలో ఆడుతూంటే ఈ ఫొటో అందులోంచి పడింది. ఎవరండీ ఈయన ?" అనడిగాను,

ఆయన ముఖంలో అదోరకమైన నవ్వు కనిపించింది. "అతనెవరో నిజంగా నీకు తెలియదా ?" అన్నారు.

ఒక్కక్షణం తటపటాయించాను. అబద్ధమాడడం మంచిది కాదనిపించింది. "తెలుసు. కానీ ఈయన మీ కేమవుతాడో తెలుసుకోవాలనుంది" అన్నాను.

"అతను నాకేమవుతాడో చెప్పలేను. అతను నాకేమికాడో కూడా చెప్పలేను. చిన్నతనం నుంచీ నా కెందరో స్నేహితులున్నారు కాని ఆరునెల్ల పరిచయంతో నా కత్యంత ఆప్తుడైపోయాడు శేషగిరి. హాస్పిటల్లో — అత్యంత దీనావస్థలో నే నున్న సమయంలో ఇతని పరిచయం లభించింది. తనకు క్యాన్సరు వచ్చిందనీ ఎంతోకాలం బ్రతకననీ అన్నాడు. మా ఇద్దరికీ గొప్పగా జత కుదిరింది." అంటూ ఆగారాయన.

"ఇప్పుడాయన ఎక్కడున్నాడు ?"

"స్వర్గంలో బహుశా ఇంద్రుడు అర్ధాసన మిచ్చి ఉండవచ్చు..." అంటూ నిట్టూర్పు విడిచారాయన.

"ఒక్క సందేహం—అతను నాకు తెలుసని మీకెలా తెలుసు ?"

"అతను నాకన్నీ చెప్పాడు. నిన్ను తను అమితంగా ప్రేమించాడట. కానీ నువ్వతన్ని ప్రేమించలేదుట నువ్వు అమాయకురాలివట. డబ్బుగురించి కలలుకంటున్నావని చెప్పాడు. నీ గురించి అతను చెప్పిన వివరాలూ, నిన్ను నేను వివాహం చేసుకోవాలన్న అతని కోరికే మన ఈ ప్రస్తుత జీవిత విధానానికి దారితీశాయి" అన్నారాయన.

ఏమిటీ? శేషగిరి కోరిక మీద ఈయన నన్ను వివాహ మాడేరా? ఇది నిజమా? నా కోరిక తెలిసిన శేషగిరి నా కోసం ఇంతమంచి వరుణ్ణి వెతికాడా? "మీరేదో దాస్తున్నారు. ఆరునెల్ల పరిచయంతో ఆయన మీకు వధువును చూసేటంత ఆప్తుడెలా గయ్యాడు? బాబుమీద ఒట్టేసి చెప్పండి" అన్నాను.

ఆయన ఉలిక్కిపడ్డట్టే కనిపించారు— "ఛీ! ఒట్టేమిటి? ఇంత చిన్న విషయానికి?"

"ఇది చిన్న విషయం కాదు నాకు నిజం చెప్పకపోతే బాబుమీద ఒట్టే!" అన్నాను దృఢంగా.

ఆయన ముఖంలో క్రమంగా రంగులు మారాయి. ఒక్క క్షణం ఆగి "నీకు నిజం చెప్పనని శేషగిరికి మాట ఇచ్చాను. కానీ ఆ మాట నిలబెట్టుకోవడం నా వల్లకాదు. నిలబెట్టుకోడంవల్ల ప్రయోజనమూ కనబడ్డంలేదు. ఈ నిజం నువ్వు తెలుసుకోవలసిన అవసరం కూడా ఉందనిపిస్తోంది నాకు" అని ఆగి "ఫోటో చూశావు. మనిషి కూడా తెలుసు. నిస్సంకోచంగా చెప్పు శేషగిరి కళ్ళు ఎలా వుంటాయి?" అన్నా రాయన.

"చాలా అందంగా" అన్నాను.

"మరి నావి?"

"ఎందుకండీ తెలుసుండీ అడుగుతారు?" అన్నాను అసహ్యంగా ఉంటాయని అనలేక.

"మరి రెండూ ఒకటే నంటే నమ్మగలవా?"

"ఏమిటీ?" అన్నాను. విషయం సరిగ్గా అర్థం కాకపోయినా ఎందుకో షాక్ తిన్నట్లనిపించింది.

"ఒక చిన్న యాక్సిడెంట్లో నా కళ్ళు దెబ్బతిన్నాయి. హాస్పిటల్లో ట్రీట్‌మెంట్ తీసుకుంటున్నాను. డబ్బున్నవాణ్ణి కాబట్టి శస్త్ర చికిత్సలో నిపుణులు ఎంతో శ్రద్ధ తీసుకుని వైద్యం చేస్తున్నారు నాకు. అయితే కొత్త కళ్ళు కావాలి నాకు. లేకపోతే శాశ్వతంగా గుడ్డివాణ్ణి కావాలి. ఆ సమయంలో నన్ను వెదుక్కుంటూ వచ్చాడు శేషగిరి. తను క్యాన్సరుతో బాధ పడుతున్నాననీ, రోజులు లెక్కపెట్టుకుంటూ బతుకుతున్నాననీ, మరణానంతరం తన కళ్ళు నా కిస్తాననీ అన్నాడు. అయితే ఒక షరతు పెట్టాడు. నీ వివరాలన్నీ చెప్పి నేను నిన్ను వివాహం చేసుకోవాలన్నాడు. నేను అంగీకరించిన మర్నాడే అతను ఆత్మహత్య చేసుకున్నాడు. తన కళ్లను నా కుపయోగించవలసిందిగా చీటీ రాసిపెట్టి మరీ చనిపోయాడు. ఫలితంగా అతని కళ్లతో నేను చూడగలిగాను. నిన్ను పొంద గలిగాను."

నా కళ్లలో నీళ్లు తిరిగాయి. "మీ కోసం నా కోసం అతను కొంచెం ముందుగా ప్రాణాలు తీసుకున్నాడన్న మాట" అన్నాను

"కొంచెం ముందుగా కాదు, చాలా చాలా ముందుగా— అతనికి ఏ క్యాన్సరూ లేదని పోస్టుమార్టంలో పోలీసు డాక్టరు ధ్రువపర్చాడుట—"

"చాలా పెద్ద దెబ్బ తిన్నాను. హఠాత్తుగా నాకుజ్ఞానోదయం కూడా అయింది. శేషగిరి నన్ను చూశాక నాకోసమే బ్రతకాలనుకున్నాడు. నన్ను మితంగా ప్రేమించాడు. కానీ నే నతన్ని తిరస్కరించాను. కాబట్టే బ్రతుకు నంతం చేసుకోదలిచాడు. అయితే నాకు డబ్బంటే ఇష్టమని అతనికి తెలుసు. అతని కళ్లని నేను ప్రేమించాననీ తెలుసు. ఆ రెండూ నాకు లభించేలా చేశాడు. చనిపోయినా కలకాలం అతని కళ్ళు నన్ను చూసే ఏర్పాటు చేశాడు. అతని ప్రేమ అపూర్వం.

అంతేకాదు ప్రేమ పరంగా నేను దరిద్రు

## చేపల లెక్క

సుమారు డెబ్భైఐదు సంవత్సరాల క్రితం ప్రపంచం మొత్తంమీద పల్లె కారులు నాలుగు మిలియన్‌ల టన్నుల చేపలు పట్టేవాళ్ళు...1960 నాటికి చేపలు పట్టేవారి సంఖ్య చేసలూ కూడా పెరిగిపోయాయి. నాలుగు మిలియన్‌ల టన్నుల నుంచి ఒక్క 60 సంవత్సరాల కాలంలో మనుషుల ఆహారం కోసం సముద్రాలలో పట్టుబడే చేపల సంఖ్య 40 మిలియన్‌లు అయింది ఇప్పుడు ప్రపంచంలో డెబ్భై మిలియన్‌లు అంటే ఏడుకోట్ల టన్నుల దాకా చేపల్ని పట్టు కుంటున్నారు.

అమెరికా, జపాన్, రష్యా, ఫ్రాన్స్ మొదలైన దేశాలన్నీ కలిసి, సముద్రాలను గాలించి, చేపలెన్నెసి వున్నాయో తెల్సుకుంటున్నారు. మనిషి ఆహారం కోసం సముద్ర గర్భంలో జరిగే అన్వేషణ సముద్ర జలాలలో పల్లెకారులు జరిపే వేటకూడా ఎక్కువైనాయి!

రాలిని. వికారనయనని. నాదగ్గర ప్రేమధనం లేదు. అందమైన ప్రేమదృష్టి లేదు.

అయస్కాంతానికి ఉత్తర దక్షిణధ్రువాలుంటాయి ఉత్తరధ్రువం-ఉత్తరధ్రువందగ్గరగా వస్తే వ్యతిరేక శక్తులు పనిచేసి రెండూ దూరంగా విడిపోతాయి. అయితే రెండు వ్యతిరేక ధృవాలు (ఉత్తర, దక్షణ ధృవాలు) దగ్గరగా వస్తే ఆకర్షించు కుంటాయి. ఇది

## అస్పృశ్యనయనాలు

అయస్కాంత లక్షణం.

నేను దరిదాన్నీ, అందవికారాన్నీ అసహ్యించు కోడానికి కారణం నాకున్న అయస్కాంత లక్షణమే!

శేషగిరి ముఖానికి అందంగా కనిపించే ఆ కళ్ళు ఆయన ముఖంలో అసహ్యంగా కనబడుతున్నాయి కళ్ళలో ఏమీలేదు వాటికి ప్రాముఖ్యత లేదు. ఈ సత్యం గుర్తించిన నేను తటాలున ఆయన్ను కౌగలించుకుని ఆకళ్ళనుముద్దు పెట్టుకున్నాను. సృష్టిలో ఇంతవరకూ ఏ ప్రియురాలికి లభించనిఅమూల్య కానుకఆకళ్ళు! ఇప్పుడాకళ్ళు నాకు చాలా అందంగా కనబడుతున్నాయి.

అయితే ఆయన ముఖంలో మార్పు కనబడింది నాకు. బాగా పరిశీలించి చూడగా అది అసూయ అని అర్థమైంది. ఇంతకాలం అసహ్యించుకున్న ఆ కళ్ళను - శేషగిరివి అని తెలియగానే ముద్దు పెట్టుకున్నానంటే ఆయన సహించగలరా?

ఇప్పుడు ఆయన కళ్ళంటె నాకెంతో ఇష్టం. నా ప్రతి చేష్టలోనూ ఆ భావం వ్యక్తమవుతూనే ఉంటుంది. నా మదిలోని భావాలను దాచుకోవడం కష్టం కానీ ఆ కళ్ళనుపొగడలేను. ముద్దాడలేను.

బహుశా శేషగిరిసంబంధి ఆ సామాన్యుడి నయనాలను తాకే అర్హత నాకు లేదని లోచి భగవంతుడు కలకాలం వాటిని నాకు అస్పృశ్య నయనాలుగా చేశాడు.



MCA-SS 60-A-Tel